## కొత్త ఓటర్లకు విమాన టికెట్‌లో రాయితీ

**ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటన**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఓటర్లను ముఖ్యంగా మొదటిసారి ఓటేయనున్న యువతను ప్రోత్సహించేందుకు విమాన టికెట్ ధరలో రాయితీ ఇస్తున్నట్టు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కంపెనీ ప్రకటించింది. 18-22 ఏండ్ల లోపు ఓటర్లు ప్రస్తుతం కొనసాగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటేయడానికి సొంత ఊరికి వెళ్లేందుకు చేసే ప్రయాణంలో 19 శాతం రాయితీ ఇస్తున్నట్టు ఆ సంస్థ తెలిపింది. బిజినెస్, ఎకానమీ క్లాసుల్లో ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నది. 'దేశ భవిష్యత్తును యువత తీర్చిదిద్దే క్రమంలో వారి సాధికారత పెంచడానికి 'ఓట్ యాజ్ యు ఆర్' కార్యక్రమం నిర్వహిస్తున్నాం' అని సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ అంకుర్ గార్గ్ తెలిపారు.

# కన్నడనాట హోరాహోరీ

- కాంగ్రెస్, బీజేపీ మధ్య టగ్ ఆఫ్ వార్
- అసెంబ్లీ ఎన్నికల గెలుపుతో కాంగ్రెస్ జోరు
- లోక్‌సభ ఎన్నికల్లో పట్టుకు బీజేపీ యత్నాలు



బెంగళూరు, ఏప్రిల్ 20: రెండుసార్లు కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చినప్పటికీ దక్షిణాదిన మాత్రం బీజేపీకి పట్టు దొరకడం లేదు. కర్ణాటకను దాటి ఆ పార్టీ ప్రభావం చూపలేకపోతున్నది. ఈ ఎన్నికల్లో కూడా బీజేపీ ఎక్కువగా ఆశలు పెట్టుకున్న రాష్ట్రాల జాబితాలో దక్షిణాది నుంచి కర్ణాటక మాత్రమే ఉంది. 370 స్థానాలను ఒంటరిగా దక్కించుకోవాలనే పట్టుదలగా ఉన్న బీజేపీ.. కర్ణాటకలో క్లీన్ స్వీప్ చేయాలనుకుంటున్నది. మరోవైపు గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో ఊపుమీదున్న కాంగ్రెస్ పార్టీ ఈసారి కన్నడనాట కాషాయ పార్టీని నిలువరించాలని అన్ని ప్రయత్నాలూ చేస్తున్నది. దీంతో కర్ణాటకలో రెండు జాతీయ పార్టీల మధ్య హోరాహోరీ పోరు నడుస్తున్నది. రాష్ట్రంలోని మొత్తం 28 స్థానాలకు ఏప్రిల్ 26, మే 7న ఎన్నికలు జరగనున్నాయి.

**గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీదే ఆధిపత్యం**

కర్ణాటకలో గత రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌పై బీజేపీ స్పష్టమైన ఆధిక్యం చూపించింది. 2014 ఎన్నికల్లో బీజేపీ 17 సీట్లు గెలవగా, కాంగ్రెస్ తొమ్మిది స్థానాలు గెలుచుకుంది. జేడీఎస్ 2 స్థానాలకే పరిమితమైంది. 2019 ఎన్నికల నాటికి కాంగ్రెస్ - జేడీఎస్ కలిసి పోటీ చేశాయి. అయినప్పటికీ బీజేపీ 28 స్థానాలకు గానూ 25 స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ మద్దతునిచ్చిన నటి సుమలత ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు. కాంగ్రెస్ 21 స్థానాల్లో పోటీ చేసి కేవలం ఒక్క స్థానాన్నే గెలుచుకుంది. జేడీఎస్ 7 స్థానాల్లో తలపడి ఒకే స్థానానికి పరిమితమైంది.

**బీజేపీ బలాబలాలు ఇవే**

గత ఎన్నికల్లో లాగానే ఈసారి కూడా కర్ణాటకలో క్లీన్‌స్వీప్ చేయాలని బీజేపీ భావిస్తున్నది. అయితే, సిట్టింగ్ ఎంపీలపై ఉన్న వ్యతిరేకత, బీజేపీ రాష్ట్ర నేతల మధ్య విభేదాలు ఆ పార్టీకి మైనస్‌గా మారాయి. ఏడాది కింది వరకు కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై వచ్చిన తీవ్ర అవినీతి ఆరోపణల ప్రభావం ఈ ఎన్నికల్లోనూ చూపించవచ్చు. కాగా, అయోధ్య రామమందిర అంశం ఎన్నికల్లో కలిసొస్తుందని బీజేపీ భావిస్తున్నది. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపక బలం కూడా బీజేపీకి ప్లస్ అవుతున్నది. పాత మైసూరు(దక్షిణ కర్ణాటక)లో బలమున్న జేడీఎస్‌తో పొత్తు కూడా బీజేపీకి కలిసిరావచ్చు. కర్ణాటకలో బీజేపీకి ప్రధాన బలం లింగాయత్ సామాజికవర్గం. మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత యెడియూరప్పకు ఈ వర్గంలో మంచి పట్టుంది. అయితే, ముఖ్యమంత్రి పదవి నుంచి యెడియూరప్పను తప్పించడం, క్రమంగా ఆయనకు ప్రాధాన్యత తగ్గించడం వల్ల 2023 అసెంబ్లీ ఎన్నికల్లో లింగాయత్ వర్గం బీజేపీకి కొంత దూరమైంది. ఇప్పుడు యెడియూరప్ప కుమారుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ద్వారా మళ్లీ లింగాయత్‌ల ఆదరణ పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది.

**సామాజికవర్గ సమీకరణాలే కాంగ్రెస్ బలం**

కర్ణాటకలో కాంగ్రెస్‌కు సామాజికవర్గ సమీకరణాలే ప్రధానబలం. సీఎం సిద్ధరామయ్యకు బీసీ, మైనారిటీల్లో మంచి ఆదరణ ఉంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు వొక్కళిగ సామాజికవర్గంలో బలముంది. కర్ణాటకకే చెందిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వల్ల దళిత ఓట్లు కూడా కాంగ్రెస్‌గా బలంగా మారొచ్చు. కానీ, జాతీయ స్థాయి అంశాలే ప్రధానంగా ప్రభావం చూపే లోక్‌సభ ఎన్నికల్లో క్యాస్ట్ ఈక్వేషన్స్ కచ్చితంగా పని చేస్తాయని చెప్పలేం. ఇక, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలు తమకు ఓట్లు కురిపిస్తాయని కాంగ్రెస్ ఆశిస్తున్నది. అయితే, ఈ పథకాలు అందరికీ అందకపోవడం, అవినీతి, రాష్ట్రంలో నీటి కొరత తీవ్రంగా ఉండటం కాంగ్రెస్‌కు మైనస్ కావొచ్చు. అంతర్గత విభేదాలు ఇబ్బందికరంగా మారొచ్చు.

**ఓట్లేస్తేనే నీళ్లంటూ వ్యాఖ్య**

## డీకేపై కేసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: 'నా తమ్ముడికి ఓటేస్తే కావేరీ జలాలు అందిస్తాం' అంటూ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి కర్ణాటక డిప్యూటీ సీఎం, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్‌పై పోలీసు కేసు నమోదైంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వెల్లడించారు. బెంగళూరు గ్రామీణ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తన సోదరుడు డీకే సురేశ్ తరపున డీకే శివకుమార్ ఇటీవల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ హౌసింగ్ సొసైటీకి ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన వాళ్లతో మాట్లాడుతూ ''నేనొక 'బిజినెస్ డీల్' కోసం ఇక్కడకు వచ్చాను. మీరు నా సోదరుడికి ఓటేస్తే.. మీకు కావేరీ జలాలు సరఫరా అయ్యేలా చూస్తాను'' అని అక్కడ ప్రజలకు చెప్పినట్టు ఆరోపణలు వచ్చాయి. డీకే ప్రసంగం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని, ఎన్నికల్లో లంచం, అనుచిత ప్రభావం కింద కేసు నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## 7 రోజుల్లో సీయూఈటీ-యూజీ పూర్తి

**15 సబ్జెక్ట్‌లకు ఆఫ్‌లైన్: ఎన్టీఏ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: యూనివర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలకు సంబంధించిన సీయూఈటీ-యూజీ ప్రవేశ పరీక్ష మూడో ఎడిషన్ ఏడు రోజుల్లో పూర్తవుతుందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) శనివారం వెల్లడించింది. అన్ని పరీక్షలు ఒకే షిఫ్ట్‌లో నిర్వహించడం జరుగుతుందని, స్కోర్ల నార్మలైజేషన్ ఉండదని పేర్కొన్నది. 15 సబ్జెక్టులకు ఆఫ్‌లైన్‌లో(పెన్ను-పేపర్ విధానం)పరీక్ష ఉంటుందని, మిగతా 48 సబ్జెక్టులకు కంప్యూటర్ ఆధారిత(ఆన్‌లైన్) పరీక్ష ఉంటుందని తెలిపింది. మే 15 నుంచి 31 వరకు పరీక్ష నిర్వహిస్తామని ఏన్టీఏ అంతకుముందు ప్రకటించగా.. ఇప్పుడు మే 24 నాటికే పరీక్ష పూర్తయ్యే అవకాశం ఉన్నది.

## ప్రసార భారతి కాదు... ప్రచార భారతి

**దూరదర్శన్ లోగో కాషాయీకరణపై విమర్శలు**

న్యూఢిల్లీ: కేంద్రం పట్ల స్వామి భక్తిని ప్రదర్శించేందుకు స్వయం ప్రతిపత్తి సంస్థ దూరదర్శన్ డీడీ న్యూస్ లోగో రంగు మార్చింది. అధికార బీజేపీ జెండా రంగైన కాషాయాన్ని డీడీ న్యూస్ లోగోకు పులమడంపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఎంతో చరిత్ర ఉన్న డీడీ న్యూస్ లోగో కాషాయ రంగులోకి మారిపోయింది. ఇక నుంచి ఇది ప్రసార భారతి ఎంత మాత్రం కాదు.. ఇది ప్రచార భారతి' అని డీడీ మాజీ సీఈవో, టీఎంసీ ఎంపీ జవహర్ సర్కార్ విమర్శించారు. ఈ చర్య ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి ఈసీ అమలు చేస్తున్న ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనన్నారు.

## గొర్రెలు కొట్లాడకుండా యాక్స్ స్ప్రే

**బ్రిటన్ రైతుల వింత ప్రయోగం**

లండన్: గొర్రెలు కొట్లాడుకొని గాయాలు చేసుకోవడం పెంపకందారులకు తలనొప్పిగా ఉంటుంది. ఈ సమస్యకు బ్రిటన్‌కు చెందిన కొందరు వింత పరిష్కారాన్ని కనుగొన్నారు. గొర్రెలకు డియోడరంట్ స్ప్రే చేస్తున్నారు. ఆ సువాసనకు గొర్రెలు కొట్లాడుకోవడం మానేసి కలిసిమెలిసి ఉంటున్నాయట. 'యాక్స్' బాడీ స్ప్రేను గొర్రెలకు స్ప్రే చేస్తే కొట్లాడుకోవడం ఆపేస్తాయని 'లేడీస్ హూ లాంబ్' అనే ఫేస్‌బుక్ గ్రూప్‌లో శామ్ బ్రైస్ అనే గొర్రెల పెంపకందారు ఓ సలహా చూశారు. ప్రయోగం చేసి చూడగా గొర్రెలు కొట్లాడుకోవడం మానేశాయి. దీంతో ఈ టెక్నిక్‌ను ఇతరులూ పాటిస్తున్నారు.

## అమిత్‌షాకు సొంత కారు లేదట!

**ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి**

అహ్మదాబాద్, ఏప్రిల్ 20: గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఎంపీగా పోటీ చేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా నామినేషన్ సందర్భంగా, తన ఆస్తులు, అప్పుల వివరాలు వెల్లడించారు. రూ.36 కోట్ల స్థిర, చరాస్తులు ఉన్నాయని, అయితే సొంతంగా కారు లేదని శుక్రవారం అఫిడవిట్‌లో వెల్లడించారు. తన వద్ద 72 లక్షలు, తన భార్య వద్ద 1.06 కోట్ల విలువైన నగలు ఉన్నట్టు తెలిపారు.

## బీజేపీ గెలిస్తే మళ్లీ ఎన్నికల బాండ్లు: నిర్మల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: సుప్రీంకోర్టు రద్దు చేసిన ఎన్నికల బాండ్ల పథకాన్ని మళ్లీ తీసుకురావాలనే ఆలోచనతో బీజేపీ ఉన్నట్టు తెలుస్తున్నది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. 2024లో మళ్లీ అధికారంలోకి వస్తే సంప్రదింపులు జరిపి ఎన్నికల బాండ్లను తిరిగి ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్టు ఆమె తెలిపారు. 'ఎన్నికల బాండ్లకు సంబంధించి భాగస్వామ్యపక్షాలతో చాలా సంప్రదింపులు జరపాల్సి ఉంది. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రూపకల్పన చేయాలి. ముఖ్యంగా పారదర్శకత కొనసాగేందుకు, నల్లధనం ప్రవేశించే అవకాశాన్ని పూర్తిగా తొలగించేందుకు ఏమేం చేయగలమో చూడాలి' అని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల బాండ్ల పథకం పారదర్శకత తీసుకువచ్చిందని, అంతకుముందు యథేచ్ఛగా ఉండేదని తెలిపారు. బాండ్ల పథకంలోని కొన్ని అంశాలను ఇంకొంత మెరుగుపర్చాల్సి ఉందని, ఇందుకోసం సంప్రదింపులు జరిపి మళ్లీ తీసుకువస్తామని ఆమె స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పుపై సమీక్ష కోరే విషయంలో కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆమె పేర్కొన్నారు.

## వయనాడ్‌లోనూ రాహుల్‌కు ఓటమే: మోదీ

నాందేడ్, ఏప్రిల్ 20: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తన పార్లమెంటరీ నియోజకవర్గమైన కేరళలోని వయనాడ్‌లోనూ ఓడిపోతారని, ఆయన మరో సురక్షితమైన స్థానాన్ని వెతుక్కోవాల్సి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోస్యం చెప్పారు. నాందేడ్‌లో ఎన్నికల ర్యాలీలో మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ.. ఈసారి వయనాడ్‌లో కూడా ఓటమి చవిచూడబోతున్నారని, ఇప్పటికే ఓటమి భయంతో సోనియా గాంధీ రాజ్యసభకు వెళ్లారని చెప్పారు.

## ఐదేండ్లకొకసారి ఐదు నిమిషాలు

**దేశం కోసం ఓటేయడం మిస్ కావొద్దు • సీజేఐ పిలుపు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: లోక్‌సభ ఎన్నికల్లో ఓటేయడం మిస్ కావొద్దని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) డీవై చంద్రచూడ్ దేశ పౌరులకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో అది ప్రథమ ప్రాధాన్యం కలిగిన బాధ్యతని తెలిపారు. 'నా ఓటు నా గళం' మిషన్‌లో భాగంగా ఎన్నికల సంఘం కోసం ఆయన వీడియో సందేశం ఇచ్చారు. రాజ్యాంగం నిర్దేశించిన విధులను నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉందని సీజేఐ పేర్కొన్నారు. 'ఐదేండ్లకు ఒకసారి దేశం కోసం ఐదు నిమిషాలు కేటాయించండి. గర్వంగా ఓటేయండి. నా ఓటు నా గళం' అని సీజేఐ అన్నారు. న్యాయవాదిగా ఉన్నప్పుడు ఎంత బిజీగా ఉన్నా ఎప్పుడూ ఓటేయడం మానలేదన్నారు. 'వేలిపై సిరా చుక్క వేయించుకొని ఓటేసినప్పుడు నాలో దేశభక్తి ఉప్పొంగి దేశంతో అనుసంధానమయ్యానన్న ఉద్వేగం కలుగుతుంది' అని సీజేఐ అన్నారు.



శశిథరూర్ | రాజీవ్ చంద్రశేఖర్ | రవీంద్రన్

## థరూర్‌కు బ్రేకులు పడేనా?

**తిరువనంతపురంలో త్రిముఖ పోరు**

కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను బరిలో నిలిపిన బీజేపీ

**సీపీఐ నుంచి రవీంద్రన్ పోటీ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: కేరళలోని తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం ఇప్పుడు అందరి దృష్టికి ఆకర్షిస్తున్నది. కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ గత మూడు పర్యాయాలుగా గెలుస్తూ వస్తున్న ఈ స్థానంలో ఈ సారి ఎలాగైనా గెలువాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉన్నది. కేరళలో తమ లోక్‌సభ విజయ ప్రస్థానానికి తిరువనంతపురాన్ని ఒక గేట్‌వేగా మార్చుకోవాలనే ప్లాన్‌లో ఉన్నది. ఇందులో భాగంగా కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను శశిథరూర్‌పై బరిలోకి దింపింది. మరోవైపు 2005 తర్వాతి నుంచి తమకు అందకుండా ఉన్న తిరువనంతపురంలో ఈసారి జెండా పాతాలని ఎల్‌డీఎఫ్ కూటమి భావిస్తున్నది. ఇందులో భాగంగా రాష్ట్ర సీపీఐ అధ్యక్షుడు పన్నియన్ రవీంద్రన్ ఈ కీలక స్థానంలో పోటీచేస్తున్నారు.

**రాష్ట్రంలో ఒక్కసీటూ గెలవని బీజేపీ**

కేరళలో ఇప్పటి వరకు ఒక్క లోక్‌సభ స్థానం కూడా గెలిచిన చరిత్ర బీజేపీకి లేదు. కమలం పార్టీ తిరువనంతపురంలో గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచింది. ఈసారైనా తిరువనంతపురాన్ని తమ ఖాతాలో వేసుకోవాలని బీజేపీ కృత నిశ్చయంతో ఉన్నది. ఇక్కడ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను బరిలోకి దింపడం ద్వారా కేరళలో పాగా వేయాలని బీజేపీ సీరియస్‌గా ఉన్నదనే విషయం స్పష్టమవుతున్నదని విశ్లేషకులు అంటున్నారు.

## రాజ్యాంగాన్ని మారిస్తే తప్పేంటి?

**కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కీలక వ్యాఖ్యలు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగం భగవద్గీతేమీ కాదని, జాతి ప్రయోజనాల కోసం దాన్ని మారిస్తే తప్పేంటని కేంద్ర జల్‌శక్తి మంత్రి, బీజేపీ సీనియర్ నేత గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. ఇంగ్లిష్ న్యూస్ వెబ్‌సైట్ 'ది ప్రింట్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 'భారత రాజ్యాంగం భగవద్గీత ఏమీ కాదు. గీతలో శ్లోకాలను మార్చలేం. అయితే, రాజ్యాంగంలో శ్లోకాలు లేవు కదా. జాతి ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని మార్చాల్సి వస్తే తప్పేంటి? రాజ్యాంగానికి సవరణలను గతంలో కాంగ్రెస్ పార్టీ కూడా చేసింది. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370 రద్దు కూడా రాజ్యాంగ సవరణతోనే సాధ్యమైంది. దేశ ప్రజల ప్రయోజనాల కోసమే ఆ సవరణలు చేశాం' అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్డీయేకు 400కు పైగా సీట్లను ఇచ్చి గెలిపిస్తే, రాజ్యాంగాన్ని మారుస్తామంటూ బీజేపీ నేతలు అనంత్‌కుమార్ హెగ్డే, లల్లూ సింగ్, జ్యోతి మిర్ధా, అరుణ్ గోవిల్ వ్యాఖ్యానించడం రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలు బీజేపీలో చేరగానే, వారిపై కేసులు మాయమవుతున్నాయంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలపై 'ది ప్రింట్' ప్రతినిధి ప్రశ్నించగా దానిపై కూడా షెకావత్ స్పందించారు. 'బీజేపీ గంగానది లాంటిది. గంగ పిల్లకాలువలను తనలో కలుపుకొన్నట్టే, మా పార్టీలో చేరాలనుకొనే అందర్నీ మేం తీసుకొంటాం. గంగలో చేరని పిల్ల కాలువ సూర్యతాపాన్ని భరించలేక చివరకు ఎండిపోవాల్సిందే' అని పేర్కొన్నారు.

షెకావత్

సౌరభ్

## 'కేజ్రీని చావుకు దగ్గర చేస్తున్నారు'

న్యూఢిల్లీ: మద్యం పాలసీ కేసులో అరెస్టయి జైలులో ఉన్న కేజ్రీవాల్‌కు వైద్య చికిత్స నిరాకరణపై ఆప్ తీవ్ర ఆరోపణలు చేసింది. తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను తన వైద్యుడిని సంప్రదించకుండా చేయడమే కాక, ఇన్సులిన్‌ను నిరాకరించడం ద్వారా ఆయనను నెమ్మదిగా మృత్యుముఖంలోకి నెడుతున్నారని విమర్శించింది. ఆప్ అధికార ప్రతినిధి, మంత్రి సౌరభ్ భరద్వాజ్ శనివారం మాట్లాడుతూ.. జైలులో కేజ్రీవాల్ చక్కెర స్థాయిలు పరిశీలిస్తే ఆయనను నెమ్మదిగా చంపడానికి కుట్ర జరుగుతున్నదని అన్నారు. అరెస్ట్‌కు కొద్ది నెలల ముందుగానే కేజ్రీవాల్ ఇన్సులిన్‌ను మానేశారని జైలు అధికారులు తెలిపారు.

## శరత్‌రెడ్డి విరాళాలపై చర్యలేవి?

- బీజేపీకి 60 కోట్లు ఇవ్వడంపై స్పష్టమైన ఆధారాలున్నా చర్యలు తీసుకోని ఈడీ
- ఆధారాలు లేకుండానే ఆప్ నేతల అరెస్టులు
- మద్యం పాలసీ కేసులో ఈడీ తీరుపై ఆప్ ప్రశ్నలు

సంజయ్ సింగ్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ దర్యాప్తు తీరుపై ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ కేసులో నిందితుడైన శరత్ చంద్రారెడ్డి నుంచి కేంద్రంలోని బీజేపీకి రూ.60 కోట్లు వెళ్లాయని, ఈ వ్యవహారంపై దర్యాప్తు సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. దేశంలో రెండు రకాల చట్టాలు ఉన్నాయా? అని ఆయన ప్రశ్నించారు. మద్యం పాలసీ కేసులో శరత్ రెడ్డి ఒక కీలక వ్యక్తి అని ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లో చెప్పిందని, అయితే ఆ వ్యక్తే బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో రూ.60 కోట్లు విరాళం ఇచ్చారని, అయినా ఈ విషయంలో ఈడీ ఎవరిపైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

**కస్టడీ నుంచి బీజేపీకి విరాళాలు ఎలా?**

శరత్ రెడ్డి మద్యం పాలసీ కేసులో అరెస్టు అయిన తర్వాత 2022, నవంబర్ 15న బీజేపీకి రూ.5 కోట్లు ఇచ్చారని సంజయ్ సింగ్ తెలిపారు. జైల్లో ఆరు నెలలు ఉన్న తర్వాత 2023, మే 8న ఆయనకు బెయిల్ వచ్చిందని, అనంతరం కొద్ది రోజుల్లోనే అధికార బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.50 కోట్లు విరాళంగా అందజేశారని పేర్కొన్నారు. అరెస్టుకు ముందు కూడా 2022లో విడతల వారీగా రూ.5 కోట్లు ఇచ్చాడని సంజయ్ సింగ్ చెప్పారు. కస్టడీలో ఉన్న శరత్ రెడ్డి బీజేపీకి కోట్లాది రూపాయలు ఎలా ఇవ్వగలిగాడో ఈడీ సమాధానం చెప్పాలన్నారు.

### తప్పుదోవ పట్టించేందుకు అమిత్‌షా యత్నం

శరత్ చంద్రారెడ్డి విరాళం విషయంలో కేంద్ర హోంమంత్రి, బీజేపీ నేత అమిత్‌షా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ దేశాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని సంజయ సింగ్ ఆరోపించారు. శరత్‌చంద్రా రెడ్డి మధ్యప్రదేశ్ బీజేపీ యూనిట్‌కు విరాళం ఇచ్చిన విషయాన్ని ఆయన అంగీకరించారని, అయితే అతను నిందితుడయితే, విరాళం ఇచ్చి ఉండకూడదని చెప్పుకొచ్చారని పేర్కొన్నారు. ఇన్ని ఆధారాలున్నా, ఈడీ ఎలాంటి చర్యలు తీసుకోదని, అయితే మద్యం పాలసీ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండానే తనతోపాటు కేజ్రీవాల్, సిసోడియాను అరెస్టు చేశారని సంజయ్ సింగ్ విమర్శించారు. దేశంలో రెండు రకాల చట్టాలు ఉన్నాయా? అని ప్రశ్నించిన సంజయ్ సింగ్.. ఇది పూర్తిగా అన్యాయమని అన్నారు.



## క్యాన్సర్ చికిత్సకు కొత్త ఇమ్యూనోథెరపీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందించేందుకు సరికొత్త ఇమ్యూనోథెరపీ పద్ధతిని అమెరికా పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఆరోగ్యకరమైన కణాలకు నష్టం కలగకుండా, కేవలం క్యాన్సర్ కణాలపైనే పనిచేసే ఈ కొత్త పద్ధతిని వర్జీనియా టెక్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు చెందిన పరిశోధకులు రూపొందించారు. సైటోకిన్ అనే ప్రొటీన్లను వినియోగించి ఈ చికిత్స చేస్తారు. ఈ కొత్త ఇమ్యూనోథెరపీ ద్వారా శరీరంలోని రోగ నిరోధక కణాలు.. క్యాన్సర్ కణాలతో పోరాడేలా, ఇతర కణజాలాలకు, అవయవాలకు క్యాన్సర్ కణతులు సోకకుండా సైటోకిన్లను పెంపొందిస్తాయి. ప్రస్తుతం చేస్తున్న కీమోథెరపీ వల్ల క్యాన్సర్ కణాలతో పాటు ఆరోగ్యకమైన కణాలకు కూడా నష్టం జరుగుతుంది. దీంతో వెంట్రుకలు ఊడిపోవడం, అలసట వంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి.

## హింసించి చంపారు!

- 17 మందిని పోలీసులే మట్టుబెట్టారు
- బీజేపీకి ప్రజాకోర్టులో శిక్ష తప్పదు
- 29 మంది మృతికి నివాళిగా 25న బంద్: మావోయిస్టులు

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 20: ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ పేరుతో శనివారం విడుదలైన లేఖ సంచలనంగా మారింది. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో జరిగింది నరమేధమని, భద్రతా బలగాల కాల్పుల్లో గాయాలైన వారిని పట్టుకొని మరీ, క్రూరంగా హింసించి చంపారని అందులో పేర్కొన్నది. కాంకేర్ జిల్లా చోటేబేథియా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనలో 29 మంది మావోయిస్టులు మృతిచెందిన ఘటనపై ఆ పార్టీ ఉత్తర్ బస్తర్ జోనల్ కమిటీ బ్యూరో మంగ్లీ పేరుతో మూడు పేజీల లేఖ విడుదలైంది. ఈ ఎన్‌కౌంటర్ పూర్తిగా అమానవీయమైనదని, నమ్మకద్రోహానికి తమ పార్టీ పీఎల్‌జీఏ సభ్యులు వీరమరణం పొందారని మావోయిస్టు పార్టీ పేర్కొన్నది. తమ పార్టీ గురించి పూర్తి వివరాలు తెలిసిన వాళ్ల నుంచి సమాచారం తెలుసుకొన్న భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని నాలుగు వైపుల నుంచి చుట్టుముట్టి దాడి చేశాయని తెలిపింది. కాల్పుల్లో 12 మంది బుల్లెట్ గాయాలతో మృతిచెందారని, మిగతా 17 మందిని పోలీస్ బలగాలు పలు విధాలుగా హింసించి, తుపాకులతో కాల్చి హతమార్చారని ఆరోపించింది. ఆదివాసీ సీఎం అయిన విష్ణుదేవ్ సాయి ఆదేశాలతోనే ఆదివాసీలు మరణించారని, ఈ నరమేధానికి ఛత్తీస్‌గఢ్‌లోని ప్రతి బీజేపీ నేతా జవాబుదారీనని పేర్కొన్నది. ప్రజా కోర్టులో వారికి తప్పక శిక్ష పడుతుందని హెచ్చరించింది. కాంకేర్ ఎన్‌కౌంటర్ ఘటనపై ప్రజా సంఘాలు నోరు విప్పాలని మావోయిస్టు పార్టీ తమ లేఖలో కోరింది. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టులకు నివాళిగా ఈ నెల 25వ తేదీన నారాయణ్‌పూర్, కాంకేర్, మాన్‌పూర్-మోహ్లా జిల్లాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ప్రకటించింది.

మావోయిస్టులు విడుదల చేసిన లేఖ

## 3 మతాల కలయికతో కొత్త మతం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): ప్రపంచంలో ప్రస్తుతం 4,200కు పైగా మతాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. తాజాగా కొత్త మతం ఒకటి చేరింది. దీనికి 'అబ్రహామిక్'గా నామకరణం చేశారు. క్రైస్తవం, ఇస్లాం, జుడాయిజం కలయికతో ఈ మతాన్ని ఏర్పాటు చేశారు. వివిధ మతాల మధ్య ఉన్న పరస్పర భేదాలను తొలగించ